
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు

మంగళవారం 24 డిసెంబరు 2024

ఎవరికీ పట్టని గిరిజనులు

- అభివృద్ధికి ఆమడదూరంలో చెంచులు
- శిథిలావస్థకు చేరిన ఆవాసాలు
- దళారుల చేతుల్లో భూములు
- అర్హత ఉన్న మంజూరు కానీ పింఛన్లు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు



పాలెంచెరువు గూడెంలో శిథిలావస్థకు చేరుకున్న గిరిజనుల ఇళ్లు



అడివిబాట పట్టిన విద్యార్థులు



సమస్యలు మొర పెట్టుకుంటున్న చెంచులు

కొత్తపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ సమీప ప్రాంతాల్లోని చెంచులు ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా వారి జీవన స్థితిగతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. కొత్తపల్లి మండలంలో పది చెంచు గూడేలు ఉండగా 392 నివాస గృహాలతోపాటు 1598 మంది గిరిజనులు ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా ఈ గూడేలలోని పాలెం చెరువు, శివపురం గూడేలలో గిరిజన విద్యార్థుల కోసం ఒకటి నుంచి 10వ తరగతి వరకు కోట్లాది రూపాయలు వెచ్చించి చూడచక్కని భవనాలు నిర్మించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గిరిజన విద్యాభివృద్ధి కుంటుపడింది. అలాగే ఈ గూడేలలో ఎప్పుడో ఐటీడీఏ అధికారులు నిర్మించిన గృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. అంతేగాకుండా ప్రభుత్వం వీరి కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ శాఖను ఏర్పాటు చేసినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. చెంచులు, గిరిజనులను అటవిబాట నుంచి తప్పించి వ్యవసాయం వైపు మళ్లించేందుకు వీరికి వ్యవసాయ భూములు సైతం కొనుగోలు చేసి ఇచ్చారు. వీరి అవగాహన రాహిత్యాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు వీరి భూములను ఆక్రమించుకుని సాగు చేస్తున్నప్పటికీ ఐటీడీఏ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని గిరిజన గూడేల్లో చెంచులకు రేషన్‌కార్డులతో పాటు అర్హులైన వారికి పింఛన్లు కూడా ఐటీడీఏ అధికారులు ఇప్పించలేకపోయారు. వీరి బాగోగులను చూసుకోవడానికి ఐటీడీఏ అధికారులను నియమించినప్పటికీ క్షేత్రస్థాయిలో తూతూమంత్రంగా వచ్చి వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అంతేగాకుండా వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అరకొర పనులు కల్పించి మమ అనిపించేస్తున్నారు. ఇప్పటికైనా అడవిబిడ్డలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పాలంచెరువు గూడెంలో పాఠశాల భవనం

భార్య చనిపోయి రెండేళ్లయినా పింఛన్ రాలేదు



గత రెండేళ్ల క్రితం అనారోగ్యంతో భార్య ఈరమ్మ చనిపోయింది. అధికారులకు విన్నవించుకున్నా పింఛన్ రావడం లేదు. నేను కూడా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాను. ప్రభుత్వం స్పందించి పింఛన్‌తో పాటు గృహం కల్పించాలి.

- కుడుముల నాగన్న

నూతన గృహాలు నిర్మించాలి



ఎప్పుడో నిర్మించిన గృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం వస్తే పూర్తిగా కారుతున్నాయి. గృహాలకు తలుపులు కూడా లేకపోవడంతో విష సర్పాలు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి నూతన గృహాలు నిర్మించాలి.

- పులిచెర్ల లక్ష్మి, పి.గుమ్మడాపురం

పదేళ్లయినా పింఛన్ రావడం లేదు



నా భర్త గూళ్ల రాముడు చనిపోయి పదేళ్లయినా వితంతు పింఛన్ రావడం లేదు. అధికారుల చుట్టూ కాళ్లరిగిలా తిరిగినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు మాకు పింఛను ఇప్పించాలి.

- గూళ్ల నాగమ్మ, గుమ్మడాపురం

నాపరాయి పరిశ్రమను ఆదుకుంటాం

- పరిశ్రమ వర్గాలు ప్రభుత్వాన్ని అర్థం చేసుకోవాలి
- నాపరాయి కార్మికుల దీక్షా శిబిరంలో మంత్రి బీసీ



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంక్షోభంలో ఉన్న నాపరాయి పరిశ్రమను ఆదుకోవడానికి అన్ని విధాలా కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం కొలిమిగుండ్ల మండలంలోని జిల్లా సరిహద్దు ప్రాంతంలో రాయల్టీ సమస్య పరిష్కరించాలని కోరుతూ నిరసన దీక్షలు చేపడుతున్న పరిశ్రమ ప్రతినిధులు, కార్మికులను మంత్రి కలిశారు. ఈ సందర్భంగా పలు నాపరాయి పరిశ్రమ యూనియన్లు, పరిశ్రమ ప్రతినిధులు, కార్మికులు, డ్రైవర్లు మంత్రి బీసీ ముందు నాపరాయి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా నిబంధనలు అమలు చేయడంతో తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. పరిశ్రమ వర్గాలు, కార్మికులను ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. వివిధ వర్గాల నుంచి సమస్యలు విన్న అనంతరం మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నాపరాళ్ల పరిశ్రమపై వివిధ రకాల పన్నులు పెంచుతూ నిర్ణయం తీసుకుంటే పరిశ్రమ వర్గాలు నిలదీయలేక పోయారని ప్రశ్నించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రభుత్వం నాపరాళ్ల రాయల్టీ పన్ను పెంచితే ఎంతో శ్రమకోర్చి పెంచిన రాయల్టీ పన్ను తగ్గించామని గుర్తు చేశారు. నాపరాయి పరిశ్రమ ప్రతినిధులతో కలిసి రేపే సంబంధిత మైనింగ్ శాఖ మంత్రి, అధిష్టానాన్ని కలిసి సమస్య తీవ్రతను వారి దృష్టికి తీసుకవెళతానని చెప్పారు. అదే సందర్భంలో పరిశ్రమ వర్గాలు కూడా పరిస్థితిని అర్థం చేసుకోవాలని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి వెళ్లి పోయిందని విమర్శించారు. ప్రభుత్వం ఏం చేయాలన్న నిధుల కొరత వెంటాడుతోందన్నారు. నాపరాళ్ల పరిశ్రమకు సంబంధించి అన్ని సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, తప్పనిసరిగా న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, అంబటి జయలక్ష్మీరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు గొంగటి హుస్సేన్‌రెడ్డి, నంద్యాల ప్రసాదు, నారాయణరెడ్డి, కామిని క్రిష్ణరంగారెడ్డి, నాపరాయి పరిశ్రమ యజమానులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మైనింగ్ యజమానుల వినతి

కుటీర పరిశ్రమలాంటి మైనింగ్ పరిశ్రమను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని బనగానపల్లె, బేతంచెర్లకు చెందిన మైనింగ్ యజమానులు సోమవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం సమర్పించారు. కాన్సిడరేషన్ పీజులు రద్దు చేయాలని, డెడ్ రెంట్ తగ్గించాలని, సెక్యూరిటీ డిపాజిట్ తగ్గించాలని, రాయల్టీ ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, గుండం మల్లికార్జునరెడ్డి, వల్లెపుశంకర్, సుబ్బరాజు, బేతంచెర్ల మండల మైనింగ్ యజమానులు పోలూరు రాఘవ, గుండం సుధాకర్, ఎల్లానాగయ్య, నాగేశ్వరరెడ్డి, తిరుమలేశ్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం 7
- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

మంత్రాలయం హుండీ ఆదాయం 6
రూ.3.47 కోట్లు

ప్రజలపై రూ.6 వేల కోట్ల భారం
- వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి 7

జగన్నాథగట్టుపై పిల్లర్ల దశలోనే ఆగిపోయిన రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ



అదే దుస్థితి

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదెకరాల్లో రాయలసీమ ఇంజనీరింగ్ కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణం రూసా నిధులతో చేపట్టారు. అయితే మూడేళ్ల క్రితం జగన్ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో కాంట్రాక్టర్ పిల్లర్ల దగ్గర పనులు ఆపేశాడు. రూసా కాలేజీస్ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ కార్యాలయంలో ఫైలు ఆగిపోయింది. వైసీపీ రంగు పూసుకున్న అధికారులే ఉండడంతో ముందుకు కదలలేదు. భవనాల పిల్లర్లకు వేసిన ఇనుప కడ్డీలు తుప్పుపట్టాయి. వాటిపైనే మళ్లీ పనులు చేపడితే ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పరిస్థితి మారలేదు. అదే దుస్థితి కొనసాగుతోంది. రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణాల దుస్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఇంజనీరింగ్ కాలేజీకి జగన్ శాపం..!
- జగన్నాథ గట్టుపై శాశ్వత భవనాలకు రూ.10 కోట్ల రూసా నిధులు
- నిధులు ఇవ్వకపోవడంతో ఆగిపోయిన పనులు
- మూడేళ్ల క్రితం పిల్లర్ల వద్దే ఆగిన నిర్మాణాలు
- తుప్పుబట్టిన ఇనుప కడ్డీలు
- ఇప్పటికీ స్పందించని కూటమి ప్రభుత్వం



తుప్పుబట్టిన పిల్లర్ల ఇనుప కడ్డీలు

కర్నూలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యను నిరుపేద విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలనే సంకల్పంతో రాయలసీమ యూనివర్సిటీ అను బంధంగా ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కాలేజీ ఆర్‌యూ క్యాంపస్‌లో కొనసాగుతోంది. సీఈసీ, ఈసీఈ, మెకానికల్, సివిల్, ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్ (ఏఐ) ఇలా వివిధ గ్రూపుల్లో దాదాపుగా వెయ్యి మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంజనీరింగ్ కళాశాలకు ప్రత్యేక క్యాంపస్ ఉండాలనే ఆశయంతో జగన్నాథ గట్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఐదెకరాల భూమి కేటాయించింది. ఒక్కో బ్లాక్ 2,800 చదరపు అడుగుల విస్తీర్ణం చొప్పున 5,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు బ్లాకులు డిజైన్ చేశారు. రూ.10 కోట్లు రూసా నిధులు నిధులు మంజూరు చేశారు. 2021లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిబంధనలు ప్రకారం సాయి పవర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ నిర్మాణాలు అప్పగించారు. 18 నెలల్లో పనులు పూర్తి చేయాలని పనులు పర్యవేక్షిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) సంస్థ ఇంజనీర్లు కాంట్రాక్ట్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం 2022 విద్యా సంవత్సరం ప్రారంభంలోగా భవన నిర్మాణాలు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, ఆనాడు జిల్లా ఇన్‌చార్జ్, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పట్టించుకోకపోవడం వల్ల నిధులు మంజూరు చేయలేదు.

మిగతా 6లో

భూ సమస్యలకు పరిష్కారం: కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నిషేధిత భూ సమస్యలను పరిష్కరించి సంబంధిత డీనోటిఫై చేసిన క్లియరెన్స్ పత్రాలను రైతులకు అందజేస్తున్నామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడారు. భూ నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములు, డీ పట్టా భూముల రికార్డులన పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నంద్యాల మండలం మూలసాగరం గ్రామ నివాసి జనాపాల శాంతి సర్వే నెంబర్ 2391లో 0.93 ఎకరాలు, కోవెలకుంట్ల బడవూడి సురేంద్ర సర్వే నెంబరు 390-1లో3.27 ఎకరాలు, డోన్ మండలం ఉంగరాణిగుండ్ల గ్రామంలో వెంకట శివరెడ్డి సర్వే నెంబరు 248లో 8.32 ఎకరాలు, బుగ్గానిపల్లెలో జి.చిన్నమద్దయ్య సర్వే నెంబర్ 779-1లో 3.79 ఎకరాలు, బనగానపల్లె మండలం పాండ్లపు గ్రామంలో చాకలి బాలరాజు, చాకలి నరసింహుడు సర్వే నెంబరు9-1లో 3.75 ఎకరాలు, మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో మనిమల మురళీ సర్వే నెంబర్161-1ఎ లో 4.86 ఎకరాలు, మిడుతూరు మండలం సుంకేసుల గ్రామంలో సుబ్బయ్య సర్వే నెంబర్ 435లో3.61 ఎకరాలకు ఉత్తర్వుల డడీ నోటిపై పత్రాలను సంబంధిత బాధిత రైతులకు కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్ పంపిణీ చేశారు.

'ప్రజా సమస్యలను పరిష్కరించండి'

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులను నాణ్యతతో సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యలను మరింత నాణ్యతతో పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2,673 ప్రజా సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద ఇంకా 20 లక్షల పని దినాల లక్ష్యాన్ని కేటాయించుకుని ఆ మేరకు పనులు చేపట్టాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 248 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, అధికారులు పాల్గొన్నారు.

మరబోట్ల లైసెన్సులపై విచారణ



సిద్దేశ్వరం వద్ద మరబోట్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీవో నాగజ్యోతి

కొత్తపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లోని సిద్దేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప గ్రామాలకు చెందిన మరబోట్ల నిర్వాహకుల లైసెన్సులపై ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ ఉమారాణి విచారించారు. సోమవారం సాయంత్రం వారు సంగమేశ్వరం నుంచి సోమశిలకు మరబోట్లు తిప్పే నిర్వహకులను పిలిపించి వారి లైసెన్సులపై ఆరా తీశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చామని అన్నారు. మరబోట్లతో పాటు బోటు నడిపే డ్రైవర్లు కూడా లైసెన్సులు లేని వారు తెచ్చుకోవాలన్నారు. లైసెన్సులు పొందిన తర్వాత కలెక్టర్ ఆదేశాలు వచ్చే వరకు మరబోట్లు తిప్పవద్దని చెప్పారు. గత రెండేళ్లుగా తెలంగాణ, ఆంధ్రకు చెందిన మరబోట్ల నిర్వాహకులు కృష్ణానదిలో మరబోట్లు తిప్పే విషయంపై తరచూ ఘర్షణలు పడుతున్న నేపథ్యంలో విచారణకు వచ్చానని చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ చంద్రమౌళితో పాటు టూరిజం డెవలప్మెంట్ మేనేజర్‌తో పాటు కొత్తపల్లి ఎస్‌ఐ కేశవలు ఉన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠం శ్రీశైలం మహాక్షేత్రానికి సోమవారం వేల సంఖ్యలో భక్తులు తరిలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధులలో రద్దీ నెలకొంది. సోమవారం రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలి వచ్చారు. వేకువ జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీపహారతులు సమర్పించారు. అలాగే వందల సంఖ్యలో భక్తులు దేవస్థానం కల్యాణకట్ట నందు తలనీలాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం తాగునీరు, అల్పాహారం అందజేశారు. క్షేత్రంలోని నిత్య అన్నదాన సత్రాలు భక్తులకు వసతి, అన్నదానం నిర్వహించి భక్తుల సేవలో తరించారు.

అలరించిన నృత్య ప్రదర్శన : ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సోమవారం సాయంత్రం విజయవాడకు చెందిన ఎమ్. కనకలక్ష్మీ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాఢ వీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మూషికవాహన, గణపతికౌత్వం, శివతాండవం, అఖిలాండేశ్వరి, లింగాష్టకం తదితర గీతాలకు శ్రీవాణి, వైష్ణవి, సహస్ర సరి, దివ్య, హాసిని, తన్విత, జ్యోతి, తేజ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

అవగాహనే అస్త్రం..!





- వినియోగదారుల హక్కుల రక్షణకు బలమైన చట్టాలు
- ప్రజల్లో కొరవడిన అవగాహన
- నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

కర్నూలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

కొనే వస్తువులోనూ.. సేవల్లోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కులు వినియోగదారులకు చట్టం కల్పించింది. ప్రస్తుత సమాజంలో లాభాపేక్ష.. ధనాపేక్ష కారణంగా మోసాలు పెరిగిపోతున్నాయి. పాలు, నీళ్లనూ సైతం యథేచ్ఛగా కల్తీ చేస్తున్నారు. ఇక తూకాల్లోనూ భారీగా తేడాలు ఉంటున్నాయి. ఆనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్తే అక్కడా మోసాలు తప్పడం లేదు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించే పంట దిగుబడులు అమ్మకానికి మార్కెట్‌కు తీసుకెళ్తే తూకాల్లో మోసాలు జరుగుతన్నాయి. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తేనో, నిలదీస్తేనో తప్పా న్యాయం జరడం లేదు. ఈ తరహా మోసాలు అరికట్టాలంటే వినియోగదారులు మేల్కోవాలి. హక్కులు తెలుసుకోవాలి. మంగళవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోదారుల హక్కుల చట్టం, ఫిర్యాదులు ఎలా చేయాలి, జిల్లా వినియోగదారుల కమిషన్ సాధించిన విజయాలు.. వంటి వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఇదీ చట్టం

భారత ప్రభుత్వం వినియోగదారుల రక్షణకు 1986లో ఒక విప్లవాత్మకమైన చట్టం తీసుకొచ్చింది. వినియోగదారుల హక్కుల రక్షణ కోసం 1985 ఏప్రిల్ 9న ఐక్యరాజ్యసమితి రూపొందించిన మార్గదర్శక సూత్రాలను సభ్యదేశాలు ఆమోదించాయి. 1986లో వినియోగదారుల హక్కుల రక్షణ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. 1986 డిసెంబరు 24న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఆనాటి నుంచి ఏటా డిసెంబరు 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ ఫోరం' ఏర్పాటు చేశారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి మూడు విభాగాలుగా ఫోరం విభజించారు.

కమిషన్‌ను ఎప్పుడు ఆశ్రయించాలంటే..!



ఆన్‌లైన్ సేవలు విస్తృతం కావడంతో ఇంటి నుంచి వివిధ వస్తువులు కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ వ్యాపార లావాదేవీలను కూడా వినియోగదారుల రక్షణ చట్టం-2019 పరిధిలోకి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కొనుగోలు చేసిన వస్తువుల్లో నాణ్యత లోపించినా, వాటి వల్ల నష్టం వాటిల్లినా, తూకాల్లో మోసాలకు పాల్పడినా, పరిహారం కోరే హక్కు ఉంది. నాణ్యతలేని, కల్తీ సరుకులు విక్రయించినప్పుడు, కాలం చెల్లిన ఔషధాలు అమ్మినా, గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువకు విక్రయించినా, ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యం, సేవాలోపం కారణంగా నష్టం వాటిల్లినా, ఎలక్ట్రానిక్ పరికరాలు సక్రమంగా పని చేయకపోయినా, విత్తనాలు, ఎరువులు, పురుగు ముందులు కల్తీ జరిగినా, బ్యాంకులు, విద్యుత్ సంస్థలు, విమానయాన సంస్థలు, బీమా సంస్థలు, అందించే సేవల్లో ఏమైనా లోపాలు ఉంటే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. ఈ-కామర్స్ సంస్థలు అన్నికూడా వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి వస్తాయి.

హక్కులు.. భద్రత.. బాధ్యత

కొనుగోలు చేసే వస్తువులు, పొందే సేవలు వినియోగదారుల రక్షణ అవసరాలు తీర్చడమే కాకుండా సుదీర్ఘ కాలంగా మన్నేలా ఉండాలి. అవి వారి జీవితాలకు, ఆస్తులకు నష్టం కలిగించేలా ఉండకూడదు. భద్రత పొందడం కోసం కొనుగోలు చేసే వస్తువుల నాణ్యతా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. మార్కెట్ మాయాజాలంలో కల్తీలు, మోసాలు పెరిగిపోవడంతో వీలైనంత వరకు ఐఎస్ఐ, ఆగ్ మార్క్, హాల్ మార్క్.. వంటి నాణ్యతా చిహ్నాలు కలిగిన వస్తువులను కొనుగోలు చేయడం ఉత్తమం. వస్తువుల ఉత్పత్తి వ్యయం, వ్యాపారి లాభం, చెల్లించాల్సిన పన్నులు కలిపే ఎమ్మార్పీ నిర్ణయిస్తారు. ఆ ధర కంటే అదనంగా వసులు చేసినా తప్పే. ఏ వస్తువు కొనుగోలు చేసినా, సేవలు పొందినా బిల్లు, వస్తువుల గ్యారెంటీ.. వారెంటీ కార్డులపై దుకాణ యజమాని సంతకం, ముద్రతో సహా తీసుకోవాలి.

జిల్లా కమిషన్ పరిష్కరించిన ఫిర్యాదులు...

- కర్నూలు నగరానికి చెందిన ఎ.రంగారెడ్డి స్థానిక సోనోవిజన్ షోరూంలో కూలర్ కొనుగోలు చేశాడు. లక్కీడ్రాలో మొదటి విజేతకు ఆల్టో కారు ఇస్తామని హామీ ఇచ్చారు. లక్కీడ్రాను సంక్రాంతి సందర్భంగా జనవరిలో పూర్తి చేయగా.. వినియోదారులను మభ్యపెడుతూ అదే కూపన్లు రెండు నెలలు తరువాత మార్చిలో జరీ చేశారు. దీనిపై వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదుదారుడికి ఆల్టోకారు లేదా రూ.4.50 లక్షలు చెల్లించాలని ఫోరం తీర్పు ఇచ్చింది.
- ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామానికి చెందిన శంఖం రాజగోపాల్‌రెడ్డి రూ.1.87 లక్షలు విలువైన నాలుగున్నర తులాల బంగారం 2018 జూన్‌లో మణప్పురం ఫైనాన్స్ సంస్థలో తనఖా పెట్టి రూ.85 వేలు రుణం తీసుకున్నాడు. రాజగోపాల్‌రెడ్డి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఫైనాన్స్ సంస్థ బంగారాన్ని వేలం వేసింది. దీంతో బాధితుడు ఫోరంను ఆశ్రయించగా.. విచారించిన వినియోగదారుల ఫోరం బాధితుడికి రూ.లక్ష పరిహారం, కోర్టు ఖర్చులకు మరో రూ.5 వేలు ఇవ్వాలని ఆదేశించింది.
- గూడూరు మండలానికి చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ ఒకరు 2021 నుంచి 2024 వరకు అమలులో ఉండే ఆదిత్య బీమా సంస్థ నుంచి రూ.25 లక్షల బీమా పాలసీ తీసుకున్నాడు. పాలసీదారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బీమా పరిహారం ఇచ్చేందుకు సదరు సంస్థ నిరాకరించడంతో బాధిత కుటుంబం కమిషన్‌ను ఆశ్రయించింది. విచారించిన ఫోరం రూ.25 లక్షలు బీమా మొత్తంతో పాటు కోర్టు ఖర్చులు రూ.50 వేలు ఇవ్వాలని తీర్పు ఇచ్చింది.
- కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన రైతు వి.పరమేశ్వరరెడ్డితో పాటు మరికొందరు రైతులు 571 బస్తాల కందిపప్పు నన్నూరు సమీపంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజీలో ఏడాది పాటు నిల్వ చేశారు. ఆ తరువాత వెళ్లి కందిపప్పు ఇవ్వమని రైతులు అడగగా.. కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం స్పందించకపోవడంతో రైతులు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. విచారించిన ఫోరం ఆ కందిపప్పు విలువ రూ.12.50 లక్షలు 9 శాతం వడ్డీతో చెల్లించాలని వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ కరణం కిశోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారయణరెడ్డి, నజీమాకౌసర్లతో కూడిన బెంచ్ తీర్పు ఇచ్చింది.
- జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిగా కరణం కిశోర్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తరువాత మూడేళ్లలో 750 ఫిర్యాదులు పరిష్కరించారు. 2024 జనవరి నుంచి ఈ రోజు వరకు 200 వరకు ఫిర్యాదులు పరిష్కరించి వినియోగదారులకు న్యాయం చేశారు.



వాట్సాప్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు

జిల్లా వినియోగదారుల పారంలో చేసే ఫిర్యాదులను 90 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మధ్యవర్తిత్వం ద్వారా ఫిర్యాదులను పరిష్కరించి సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా స్వీకరించి ప్రతివాదులకు నోటీసులు పంపించి.. వినియోగదారులకు అండగా నిలుస్తాం. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయించినా, నాసిరకం ఉత్పత్తులు అంటగట్టి సేవా లోపానికి పాల్పడినా ఇంటి నుంచి వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ 'వాట్సాప్ చాట్‌బాట్' సేవలను తీసుకొచ్చింది. వాట్సాప్ నంబరు 88000 01915కు ముందుగా హాయ్ అని టైప్ చేయాలి. అక్కడి నుంచి వచ్చే సూచనలు ఆధారంగా వివరాలు నమోదు చేస్తే జాతీయ వినియోగదరాల కమిషన్ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుంది. ఆ తరువాత ఆ ఫిర్యాదు పరిష్కారం కోసం సంబంధిత జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుతారు. అలాగే.. 18001 14000 లేదా 1915 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. నంబర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

- కరణం కిశోర్‌కమార్, అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల కమిషన్, కర్నూలు

ఏ ఫిర్యాదు ఎక్కడ.. ఎంత నగదు



- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి మూడు స్థాయిలో కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ (వినియోగదారుల కమిషన్) పని చేస్తుంది. జిల్లా స్థాయి ఫోరం వస్తువులు/సేవల విలువ రూ.50 లక్షలలోపు ఫిర్యాదులు పరిష్కరిస్తుంది. రూ.కోటి నుంచి రూ.2 కోట్ల మధ్య రాష్ట్ర స్థాయి, రూ.2 కోట్లకు మించిన విలువ కలిగిన ఫిర్యాదులను జాతీయ స్థాయి ఫోరం పరిష్కరిస్తుంది.
- వస్తు సేవల్లో నష్టపోయి పరిహారం కోరాలనుకుంటే.. వివరాలను నాలుగు ప్రతులతో దరఖాస్తు చేయాలి. వస్తువుసేవల కొనుగోలు రుజువులు జతపర్చాలి. ఫోరం ఫీజు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రూ. రూ.200, రూ.5 - 10 లక్షల వరకు రూ.400, రూ.10 లక్షలు ఆపైన పరిహారం కోసం రూ.500 రుసుం చెల్లించాల్సి ఉంటుంది.
- ఫిర్యాదును పరిశీలించిన తరువాత ఫోరం స్వీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. వివిధ కారణాలతో తిరస్కరిస్తే ఫిర్యాదుదారుడు తనవాదన వినిపించవచ్చు. ఫోరంలో వినియోగదారుడే తన కేసును వాదించుకోవచ్చు లేదా న్యాయవాదిని నిమించుకోవచ్చు.

కోల్డ్ స్టోరేజీ ప్లాంటుకు మళ్లీ జీవం

రూ.6 కోట్లతో ప్రతిపాదనలు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో నిలిచిన కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మాణం మళ్లీ మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. ఇటీవల మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత కోల్డ్ స్టోరేజీ ప్లాంటును పూర్తి చేసేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు. దాదాపు రూ.6 కోట్లతో ప్లాంటు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఆర్డీఎఫ్ నిధు లతో పూర్తి చేయడమా లేక బయటి మార్కెట్ కమిటీ యార్డుల నుంచి అప్పుగా రుణాలను తీసుకుని పూర్తి చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు.



ముళ్లకంపల మధ్య నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మాణం

అదే దుస్థితి

(5వ పేజీ తరువాయి)



నిర్మాణ స్థలంలో తుప్పుబడుతున్న ఇనుము

ఆర్‌యూ ఇంజనీరింగ్ కాలేజీకి మొదట రూపాల సంగమేశ్వరుడు ఆలయం పక్కనే 5 ఎకరాలు స్థలం ఇచ్చారు. దీని మీద అభ్యంతరం రావడంతో ఆలయానికి దిగువన నాటి రెవిన్యూ అధికారులు భూమి కేటాయించారు. కొండ ప్రాంతం కావడంతో.. రాక్ కటింగ్ చేసి ఎగుడు దిగుడు లేకుండా చదును చేశారు. పునాదులు తీసి పిల్లర్లు (కాలమ్స్) వేశారు. దాదాపు రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. తొలి బిల్లు ఇవ్వాలని 2021 అక్టోబరులో రూసా కార్యాలయానికి పంపారు. ఆ ఫైల్ స్టేట్ కౌన్సిల్ ఛైర్మన్ కార్యాలయానికి చేరింది. ఆనాటి రాయలసీమ యూనివర్సిటీ అధికారులు పట్టించుకోలేదో.. నిధులు లేమితో ప్రభుత్వం కావాలనే ఆ ఫైలు పక్కన పెట్టిందోగాని 2021 డిసెంబరులో పిల్లర్ల వద్దే కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. మూడేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే అసంపూర్తిగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూసా నిధులు సకాలంలో వాడుకోకపోవడంతో వెనక్కి వెళ్లాయని అంటున్నారు.

బిల్లులు రాగానే పనులు మొదలుపెడతాం

జగన్నాథగట్టుపై ఐదు ఎకరాల్లో రాయలసీమ వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాలు చేపట్టాం. ప్రభుత్వం రూసా నిధులు రూ.10 కోట్లు మంజూరు చేసింది. బిల్లులు రాలేదని కాంట్రాక్టరు పనులు ఆపేసిన మాట నిజమే. కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్లతో రెండు రోజుల క్రితం మాట్లాడాను. బిల్లులు రాగానే పనులు చేపడతామని చెప్పారు. తుప్పు పట్టిన పిల్లర్ల ఇనుప కడ్డీలు నిర్మాణానికి ఉపయోగ పడుతాయో లేదో థర్డ్ పార్టీ సివిల్ ఇంజనీరింగ్ నిపుణులతో అధ్యయనం చేయిస్తాం. వాళ్ల ఇచ్చే నివేదిక ఆధారంగానే పనులు మొదలు పెడుతాం.

- ఎన్‌టీకే నాయక్, వైస్ చాన్సలర్, రాయలసీమ వర్సిటీ, కర్నూలు

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పనులు మొదలు కాలేదు. ఎప్పుడు మొదలు పెట్టేదీ చెప్పేవారు లేరు. పాత బిల్లులు ఇవ్వడం గురించి ఎలాంటి ప్రకటనా లేదు. తుప్పుపట్టిపోయిన ఇనుక కడ్డీల వ్యవహారం ఏం చేసేదీ చెప్పడం లేదు. కాకపోతే ఐఐటీ కళాశాల నిపుణులతో అధ్యయనం చేయించింది. వారు ఇచ్చిన నివేదిక ఆధారంగానే పనులు పునః ప్రారంభించే అవకాశం ఉంది. అంతకు మించి మూడేళ్లుగా ఆగిపోయిన ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణం గురించి స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం నుంచి రాలేదు.

తుప్పుబట్టిన ఇనుప కడ్డీలు

కళాశాల భవనాల పునాదులు ఒక్కటే పూర్తి చేశారు. భూ మట్టం, బేస్‌మట్టం లెవల్‌లో పిల్లర్ల నిర్మాణాల కోసం ఇనుప కడ్డీలు ఏర్పాటు (సెంట్రింగ్) చేసి వదిలేశారు. మూడేళ్లుగా ఎండకు ఎండి.. వర్షాలకు తడవడంతో ఇనుప కడ్డీలు తుప్పు పట్టాయి. ఆ కడ్డీల పైనే మళ్లీ నిర్మాణాలు చేపడితే భవనాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందని, జీవిత కాలం తగ్గిపోతుం దని సివిల్ ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు

మంత్రి టీజీ భరత్ జోక్యం చేసుకోవాలి

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల నేడు టీడీపీ కూటమి ప్రభుత్వానికి అదనపు భారం తప్పడం లేదు. అయితే.. గ్రామీణ నిరుపేద విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ జోక్యం చేసుకోవాలి. ఆర్‌యూ అధికారులతో సమీక్ష నిర్వహించాలి. రాష్ట్ర మానవ వనరులు (విద్యా) శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లాలి. స్టేట్ కౌన్సిల్ ఛైర్మన్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైలుకు మోక్షం కల్పించాలి.. ఆగిపోయిన ఇంజనీరింగ్ కాలేజీ పనులు మొదలు పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

400 ఏళ్ల నాటి రామదుర్గం చర్చి



బ్రిటిష్ కాలం నాటి పురాతన చర్చి

ఆలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలోని ఓ చర్చికి నాలుగు శతాబ్దాల ఘన చరిత్ర ఉంది. మండలంలోని రామదుర్గం ప్రార్థనా మందిరాన్ని 400ఏళ్ల సంవత్సరాల క్రితం నిర్మించారు. 1780లో ఫాదర్ సెయింట్ అనే రామదుర్గం చర్చిని గోవా రిజిస్టర్‌లో రాయించారు. ఇది జరగక 150 ఏళ్లకు ముందు ఆదోనికి చెందిన మినుముల చిన్న నాగప్ప, పెద్ద నాగప్ప రామదుర్గంలో పునీత అన్నమ్మ చర్చి నిర్మించారు. చిన్న నాగప్ప, పెద్దనాగప్ప జొన్నల వ్యాపారం నిమిత్తం కోసం రాయచూరు వెళ్లారు. అక్కడ క్రైస్తవ గురువు కాటేటిస్టును కలుసుకున్నారు. ఆయన బోధనలతో వారు క్రైస్తవ మతాన్ని స్వీకరించి రామదుర్గం, ఆదోని ప్రాంతాల్లో చర్చిలు నిర్మించారు. ఆ తర్వాత గోవా క్రైస్తవ మిషన్ నుంచి వందలాది మంది విదేశీయులు రామదుర్గం చర్చిలో సేవలందించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో విదేశీయులు డైనవెర్మలిన్ అనే ఫాదర్ రామదుర్గంలో చర్చిలో స్థిరపడ్డారు. విద్య, వైద్యం చేస్తూ, కరవు కాలంలో ఆహార ధాన్యాలిచ్చి ప్రజలను ఆదుకున్నారు. ప్రస్తుతం రామదుర్గంలో రాతి కట్టడంతో ఉన్న చర్చిని 1972లో నిర్మించారు. కాల క్రమేణా పాలనా సౌలభ్యం కోసం ఆదోనికి మారింది. చిప్పగిరిలో రూ.1.50 కోట్ల వ్యయంతో ఫాతీమా ఆర్సీఎం పేరుతో పాఠశాల నిర్మించారు. ఈ గ్రామానికి చెందిన 16మంది ఫాదర్లు విదేశాల్లో, మన దేశంలోనూ మత బోధన చేస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా పండుగకు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, ఊరేగింపు, అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామదుర్గంలో చర్చిలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు మొదలయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు సోమవారం నిర్వాహకులు ఏర్పాటు పూర్తి చేశారు.

భలా ధినేష్...

జాతీయ స్థాయిలో బంగారు పతకం



కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన మున్నెప్ప వెంకట శ్రీనివాసులు, శోభా దంపతుల కుమారుడు మున్నెప్ప వెంకటశ్రీ దినేష్ 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ (అండర్-16) గుజూరియో కరాటే చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించాడు. పోటీలు ఢిల్లీ నగరంలో జరిగాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించి బంగారు పతం సాధించి పలువురు మార్షల్ ఆర్ట్స్‌కు ఆదర్శంగా నిలిచారు. తండ్రి హెచ్‌సీ సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు. దినేష్ తాతయ్య వెంకటరమణ విశ్రాంత పీఈటీ (ప్యాపిలి మండలం) కావడం విశేషం. జాతీయ స్థాయిలో బంగారు పతకంతో పాటు గతంలో వైజాగ్, గుంటూరు అనంతపురం, ముంబై, ఢిల్లీ, కేరళ, ఏషియన్స్ ఢిల్లీ, ఎంపీ పంజాబ్ ఇండోర్‌లో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అనేక సార్లు పతకాలు సాధించాడు. జిల్లాలో ప్రభుత్వ అధికారులు కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందుమాధవ్, డీఈవో శ్యామ్యూల్ పాల్, ఏఎస్పీతో అవార్డు, మెడల్స్ అందుకున్నాడు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటూ..

దేశానికి సేవ చేసే ప్రతి పౌరుడు సైనికుడే..

రాష్ట్రపతి పోలీస్ మెడల్ గ్రహీత జవాన్ రామాంజనేయులు



వీరజవాన్ రామాంజికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



పత్తికొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సరిహద్దులో దేశ రక్షణకు కోసం పని చేసేవారితో పాటు దేశానికి సేవ చేసే ప్రతి పౌరుడు సైనికుడే అని బీఎస్ఎఫ్ జవాన్ రామాంజనేయులు అన్నారు. రాష్ట్రపతి పోలీస్‌మెడల్ అందుకున్న బీఎస్ఎఫ్ జవాన్ రామాంజనేయులు సోమవారం స్వగ్రామం పత్తికొండకు వచ్చారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో వీరజవాన్‌కు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులు జాతీయ జెండాలతో స్వాగతం పలుకుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలిలో సీఐ జయన్న, బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్‌నాయుడు, న్యాయవాది సుధాకర్‌ల ఆధ్వర్యంలో జవాన్ రామాంజనేయులును సన్మానించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు వీరేషప్ప, రామ్మోహన్, రాజేష్ తదితరులు ఉన్నారు.

మంత్రాలయం హుండీ ఆదాయం రూ.3.47 కోట్లు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

మంత్రాలయం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,46,84,817 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తిలు తెలిపారు. సోమవారం నవంబరు మూడు రోజులతో పాటు డిసెంబరు 22 రోజుల వరకు సంబంధించిన 25 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ అధికారి బింధుబాయి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య శ్రీమఠంలోని 24 హుండీలను లెక్కించినట్లు తెలిపారు. రూ.3,46,84,817 నగదుతోపాటు 1.900 కేజీల వెండి, 64 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈ హుండీ లెక్కింపులో ఈఈ సురేష్ కోనాపూర్, ఎస్టేట్ అధికారి బీ.శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు అనంత పురాణిక్, రవికుల కర్ణి, జేపీ స్వామి, రమణరావు, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, నవీన్, లక్ష్మీకాంత్, గురురాజ్ పాల్గొన్నారు.



తవ్వకాల్లో బయటపడ్డ తామ్రపత్రాలు



బయటపడ్డ వెండి, బంగారు నాణేలు





పంచమఠాల పునరుద్ధరణలో తామ్ర శాసనాలు

బంగారు, వెండి నాణేలు కూడా లభ్యం ● గ్రంథ రూపంలో తామ్రశాసనాల ప్రచురణకు దేవస్థానం నిర్ణయం

నంద్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్ర పరిధిలో దేవస్థానం చేపట్టిన పంచమఠాల పునరుద్ధరణ పనుల్లో పలు దఫాలుగా పురాతన తామ్రశాసనాలు, వెండి, బంగారు నాణేలు లభించాయి. ఏడో శతాబ్దం నుంచి 16వ శతాబ్దం మధ్య కాలంలో నిర్మించిన ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, భీమ శంకరమఠం, సారంగధారమఠం అన్నీ కూడా ఆలయ నిర్మాణాన్ని పోలిఉంటాయి. ఈ మఠాలు శిథిలావస్థకు రావడంతో దేవస్థానం ప్రాచీన నిర్మాణశైలికి విఘాతం కలగకుండా జీర్ణోద్ధరణ పనులు చేపట్టి పునర్నిర్మాణం చేపట్టింది. ఈ క్రమంలో చేపట్టిన తవ్వకాల్లో పలు దఫాలుగా పురాతన తామ్రశాసనాలు, వెండి, బంగారు నాణేలు లభించాయి. లభించిన వాటిలో 53 తామ్ర శాసనాలు, 15 బంగారు నాణేలు, 265 వెండి నాణేలు, ఒక తామ్ర నాణెం లభించాయి. కాగా లభించిన తామ్ర శాసనాలు, నాణేల విశ్లేషణకు దేవస్థానం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారాన్ని తీసుకుంది. ఈ శాసనాలన్నీ సంస్కృతం, తెలుగు, కన్నడ, ఒరియా భాషల్లో ఉన్నట్లుగా గుర్తించారు. ఇక నాణేలు ఆధునిక కాలంనాటివిగా చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ శాసనాల్లోని విషయాలను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, మైసూరు వారు ప్రతి శాసనాన్ని విశేషించి శాసనాల్లోని చారిత్రక అంశాల వివరణను రూపొందిస్తుంది. పాఠకుల సౌకర్యార్థం దేవస్థానం ఈ శాసన గ్రంథాన్ని గ్రంథంగా ప్రచురించనుంది.

మాదక ద్రవ్యాలపై అవగాహన అవసరం

• ఆర్‌యూ ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకె నాయక్

కర్నూలు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో పాటు సామాజిక రుగ్మతలపై యువతకు అవగాహన అవసరమని ఆర్‌యూ ఇన్‌చార్జి ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకె నాయక్ అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో రాష్ట్ర లీగల్ సర్వీసు ఆథారిటీ, అమరావతితో పాటు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సమన్వ యంతో ఎన్ఎస్ఎస్ విభాగం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాస రచన, లఘు చిత్రాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా. గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, ర్యాగింగ్, బాల్యవివాహల గురించి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందజే శారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు కె వెంకటరత్నం, బి.విజయుడు, నగచంద్రుడు, శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలపై రూ.6 వేల కోట్ల భారం

• వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు ప్రజలపై దాదాపు రూ.6వేల కోట్ల భారం మోపారని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలా పెంచుకుంటూపోతే ఐదేళ్లలో ఏమి జరుగుతుందో ఊహించుకొని ప్రజలు భయానికి లోనవుతున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. కాలేజీ యాజమాన్యాలు కూడా విద్యార్థులను కళాశాలకు రానివ్వడం లేదన్నారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కే శ్రీదేవి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలపై యూజర్ చార్జీలు వేయబోతున్నారని అన్నారు. అనంతరం వైసీపీ పోరుబాట పోస్టర్‌ను వివడుదల చేశారు. సమావేశంలో వైసీపీ నాయకులు అహ్మద్ ఆలీఖాన్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

• ఉర్దూ వర్సిటీలో వర్క్ షాప్

కర్నూలు అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేసినప్పుడే నూతన ఆవిష్కరణలు జరుగుతాయని పద్మావతి మహిళా యూనివర్సిటీ డీఎస్ఐఆర్ ప్రొఫెసర్ పి.జోత్స్న అన్నారు. సోమవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో డీఎస్ఐఆర్, టీటీసీఐసీ, ఉర్దూ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్క్ షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇన్నోవేషన్‌పై దృష్టి సారించి జాబ్ సెక్టార్‌లో విద్యార్థులకు ఉద్యోగాలు దక్కేలా వారికి తర్ఫీదును ఇవ్వాలన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా కేంద్ర ప్రభుత్వం సైన్సు అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ విద్యార్థులకు ప్రాజెక్టు ద్వారా పరిశోధనలకు ప్రోత్సహిస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ పీఎస్ షావలి ఖాన్, రిజిస్ట్రార్ లోకనాథ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిమడుగు గ్రామ పొలిమేరలోని పొలాల్లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ ఎం.కేశవ తెలిపారు. మండలంలోని ఎర్రమఠం గ్రామానకి చెందిన కొమ్ము శేఖర్ ముసలిమడుగు గ్రామ సరిహద్దుల్లో పచ్చజొన్న పంటను సాగు చేసుకున్నాడు. ఆ ప్రాంతంలో సోమవారం ఓ మృతదేహం పడి ఉండటాన్ని గమనించి గ్రామానికి చెందిన తలారీ మద్దిలేటి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహం కుళ్లిపోయి ఉండడాన్ని పరిశీలించి ఈ వ్యక్తి చనిపోయి సుమారు ఆరు రోజులైందని గుర్తించారు. వయస్సు 45 ఏళ్ల మధ్యలో ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తలారి మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కేశవ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఎమ్మిగనూరు జాతీయ రహదారి పక్కన ఉన్న కానుగ చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయంలో గుజురు సామాన్లు వేరుకుంటూ జీవనం సాగించే వ్యక్తి ఆదివారం రాత్రి రాత్రి ఎవరూలేని సమయంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్ఐ పరమేష్ నాయక్ పరిశీలించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నంద్యాల పట్టణ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మధుమణి నర్సింగ్‌హోం సమావేశ భవనంలో వైద్యులు, న్యాయవాదులు, పోలీస్‌శాఖ కలిసి సదస్సు నిర్వహించారు. న్యాయకళాశాల అసిస్టెంట్ ప్రొఫెషర్ డా.షేక్‌మాలిక్ బాషా, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఐఎంఏ మహిళా విభాగం కార్యదర్శి డా.లక్ష్మీసౌజన్య, నంద్యాల కార్యదర్శి డా.ఫనిల్‌కుమార్, డా.మధుసూదన్‌రెడ్డి, డా.అనిల్‌కుమార్ ఉన్నారు.

నేను ఎవరనుకున్నావు?





మంత్రి కొల్లు రవీంద్ర అనుచరుడిని...
నా వైన్ షాపు దగ్గరకు వస్తావా?.. జాగ్రత్త!
పోలీసు, ఎక్సైజ్ పోలీసులకు బెదిరింపులు

కోడుమూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అధికారం మాది... మంత్రి కొల్లు రవీంద్ర అనుచరుడిని... నా వైన్ షాపుకు దగ్గరకు వస్తే సహించేది లేదు. ఇక్కడేం జరిగినా పట్టించుకోకూడదు.. లేదంటే శ్రీకాకుళానికి బదిలీ చేయిస్తా... పోలీసులను కోడుమూరులో ఓ వ్యక్తి ఇట్లా బెదిరిస్తున్నాడు. తమ పార్టీ అధికారంలో ఉందని ఆగడాలకు పోతున్నాడు. మంత్రి పేరు చెప్పి పోలీసులపై పెత్తనం చెలాయిస్తున్నాడు. అధికారం ఉంటే ఎక్కడికైనా తెగబడతారు. ఏ మాటలైనా మాట్లాడుతారు. కోడుమూరులో ఓ వైన్ షాప్ యజమాని మంత్రి కొల్లు రవీంద్ర పేరు చెప్పుకొని చెలరేగిపోతున్నాడు. తన వైన్‌షాపు సమీపంలో ఏం జరిగినా... చూసీచూడనట్లు వెళ్లాలే గాని చర్యలు తీసుకోడానికి లేదని పోలీసులను, ఎక్సైజ్ అధికారులతో అంటున్నాడు. మంత్రి అనుచరుడినని చెప్పడంతో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు ఈయన ఆగడాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఆయన చేస్తున్న హంగామాకు తల పట్టుకొంటున్నారు.

బార్‌ను తలపిస్తున్న వైన్ షాపు

మంత్రి అనుచరుడి వైన్ షాపు బార్‌ను తలపిస్తున్నది. ఆయన వైన్ షాపు వెనక మద్యం బాబులకు కుర్చొని తాగడానికి అన్ని సౌకర్యాలు కల్పించాడు. ప్రభుత్వం వైన్ షాపులకు ఎలాంటి పర్మిట్ రూంలు ఇవ్వలేదు. అయినప్పటికీ తాను మంత్రి అనుచరుడి అంటూ బార్‌ను తలపించేలా మద్యం ప్రియులకు తాగడానికి ఆశ్రయం కల్పిస్తున్నాడు.

మంత్రి అనుచరుడేనా.. మేమూ రూంలు ఏర్పాటు చేస్తాం..

పరిమిట్ రూంలు మంత్రి అనుచరుడికేనా... మేమూ ఏర్పాటు చేసుకుంటామని మిగిలిన వైన్ షాపు లైసెన్సుదారులు తెగబడ్డారు. దీంతో మద్యం బాబులు రూం లోపల, బయట, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కన్నెత్తి చూడని పోలీసులు

మంత్రి అనుచరుడి వైన్ షాపు చుట్టు పక్కల మద్యం ప్రియులు ఎక్కడ పడితే అక్కడ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇటీవల కాలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వాళ్లను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంలో తెలుసుకొన్న షాపు యజమాని హుటాహుటిన మంత్రి దగ్గర ఉన్న ఒక అధికారి నుంచి పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో పోలీసులు మద్యం బాబులను వదిలేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

చిల్లర కొట్టు వాళ్లపై వేధింపులు

వైన్ షాపు సమీపంలో కొంత మంది చిల్లరకొట్లు పెట్టుకొని వాటర్, గ్లాసులు, బీడీలు, సిగరెట్లు, తినుబండారులు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. వాళ్లపై మంత్రి అనుచరుడు పెత్తనం సాగిస్తున్నాడు. తనకు నెలకు రూ.10వేల చొప్పున మామూళ్లు చెల్లించాలని లేకపోతే కేసులు నమోదు చేయిస్తానని బెదిరించాడు. ఇందుకు నిరాకరించిన వాళ్లపై కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చారు. అంతేకాకుండా బంకులకు కరెంటు కట్ చేయించాడు. మంత్రి అనుచరుడికి మామూళ్లు ఇవ్వలేక కొంత మంది జీవనోపాధి కోల్పోయారు.

కేసులు నమోదు చేస్తాం

ప్రభుత్వం పర్మిట్ రూంలను కేటాయించలేదు. మద్యం ప్రియులకు తాగడానికి ఆశ్రయం కల్పిస్తే రూం యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

\- మంజుల, ఎక్సైజ్ సీఐ, కోడుమూరు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తాం. అలాగే తాగి వాహనం నడపడం కూడా నేరమే. అలాంటి వాళ్లపై కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తాం.

\- ఏపీ శ్రీనివాసులు, ఎస్ఐ, కోడుమూరు





గాయడప్ల షేక్షావలి, బాలిక వీపుపై గాట్లు

పిచ్చి కుక్క స్వైరవిహారం

• కాల్వలో నలుగురిపై, పత్తికొండలో బాలికపై దాడి..

ఓర్వకల్లు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నలుగురిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. షేక్షావలి, హనీఫాతోపాటు మరో ఇద్దరు చిన్నారులను కరవడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలికపై వీధి కుక్కల దాడి

పత్తికొండ: పట్టణంలోని తేరుబజార్ ప్రాంతంలో ముబినా అనే ఏడేళ్ల బాలికపై వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న స్థానికులు కుక్కలను తరమడంతో గాయాలతో బాలిక బయటపడింది. బాలిక 1వ తరగతి చదువుతోంది. మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి వెళ్తుండగా బ్రహ్మయ్యస్వామి దేవాలయం వెనుక ప్రాంతంలో నాలుగు వీధి కుక్కలు ముబినాపై దాడి చేశాయి. ముబినా గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న స్థానికులు కుక్కలను తరిమి బాలికను కాపాడారు. గాయపడ్డ బాలికను పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు.

మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలి

• రిటైర్డు ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించడమే సుపరిపాలన వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో సుపరిపాలన వారోత్సవాలపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 25న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా సుపరిపాలన వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు జవాబుదారితనంతో, అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, ఉత్తర్వులు చిత్తశుద్ధితో అమలు చేయడంతోపాటు ప్రజల దగ్గరికి చేరే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేస్తే అభివృద్ధి పథంలో నడిపించగలమన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

• ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మాగాంధీ నగర్‌లో సీసీ రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో అక్రమంగా గోడలు కట్టేశారు అన్న కథనానికి ఎమ్మెల్యే పార్థసారథి మున్సిపాల్ టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య, డీఎస్పీ సోమన్న స్పందించారు. ధ్వంసం చేసిన రహదారిని పరిశీలించారు. మహాత్మాగాంధీ నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే పార్థసారథికి గోడును వెళ్లబోసుకున్నారు. పేదోళ్లు బతకరాదా... స్లం ఏరియా వాళ్ళు తిరుగుతున్నారు అన్న నెపంతో అక్రమంగా గోడ కట్టడమే కాకుండా, రోడ్డును ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వేడుకున్నారు. ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వ సొమ్ము రూ.16లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉన్న గోడను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ధ్వంసం చేసిన రోడ్డుకు సంబంధించిన అమౌంటును కూడా రాబట్టి సీసీ రోడ్డును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ కౌన్సలర్ భీమన్న, నాగరాజు గౌడ్, ఉపేంద్ర ఉన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

రైతులకు నష్టం చేయొద్దు

• కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న రైతుల్ని చేతనైనంత ఆదుకుందామని, ఎవరైనా కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు నష్టం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి హెచ్చరించారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో టెండర్ ఆఫీసుతో పాటు యార్డులో రైతులు, వ్యాపారులు కమీషన్ ఏజెంట్లతో మాట్లాడారు. రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను ఎలక్ట్రానిక్ కాటాలో తూకం వేయించి అక్రమాలు ఏమైనా చోటు చేసుకుంటున్నాయేమోనని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నష్టం జరిగిందని అనిపిస్తే వెంటనే తమ కార్యాలయంలో వచ్చి ఫిర్యాదు చేయాలని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. వ్యాపారస్థులు, కమీషన్ ఏజెంట్లతో లైసెన్సు తీసుకున్న వారంతా తప్పనిసరిగా టెండర్‌లో పాల్గొనాలని, ఎవరైనా గైర్హాజరైతే చర్యలు లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్, అకౌంటెంట్ కిషన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న సెక్రటరీ, సూపర్‌వైజర్లు

బాధితులకు న్యాయం చేస్తాం

• ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో అందిన సమస్యలపై విచారణ జరిపి చట్టపరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 80 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులను పునరావృతం కాకుండా చూడాలని, నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని పేర్కొన్నారు. ఉమ్మడి ఆస్తి తన వద్ద ఉంచుకొని భాగ పరిష్కారం చేయకుండా తన రెండో తమ్ముడు రామ్మోహన్‌రావు బెదిరిస్తున్నాడని విచారణ జరిపి న్యాయం చేయాలని డోన్ పట్టణానికి చెందిన రామచంద్రరావు అనే వ్యక్తి ఎస్పీతో మొరపెట్టుకున్నాడు. కొత్తపల్లి గ్రామానికి చెందిన లోకేష్ అనే వ్యక్తితో తనకు తల్లిదండ్రులు వివాహం జరిపించారని, పెళ్లి సమయంలో రూ.3లక్షల నగదు, 10తులాల బంగారం ఇచ్చారని, తిరిగి భర్త, అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తూ ఇంటినుంచి గెంటివేశారని గోస్పాడు మండలానికి చెందిన తులసి అనే మహిళ ఎస్పీని ఆశ్రయించారు. తాను ప్రస్తుతం పుట్టింట్లో ఉంటున్నానని, తన భర్తకు మరొక మహిళతో వివాహం చేస్తామని అత్తింటివారు బెదిరిస్తున్నారని, న్యాయం చేయాలని తులసి ఎస్పీని వేడుకున్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు: ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ జగన్మోహన్

బండిఆత్మకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్‌నేరగాళ్ల వలలో పడొద్దని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. సోమవారం బండిఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలకు పాల్పడుతున్నారని, ఆశకు వెళ్లి నష్టపోరాదన్నారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు. మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంటల బీమాను నమోదు చేసుకోండి

ఆత్మకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం పరిధిలో రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు సంబంధించి బీమా నమోదు చేసుకునేందుకు 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం తెలిపారు. వరి, జొన్న, మినుము, వేరుశనగ, ఉల్లి పంటలు సాగు చేసిన రైతులు కస్టమ్ హైరింగ్ సెంటర్ వద్దకు వెళ్లి తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల బీమా ప్రీమియం చెల్లించాలంటే రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోని రైతులకు పంటల బీమా వర్తించదని అన్నారు. రైతులు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన వెల్లడించారు.

రేషన్ డీలర్ల నియామక నోటిఫికేషన్ రద్దు



మాట్లాడుతున్న ఆర్డీవో నాగజ్యోతి

ఆత్మకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈ నెల 16వ తేదిన విడుదల చేసిన రేషన్ డీలర్ల నియామక నోటిఫికేషన్‌ను అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు ఆర్డీవో నాగజ్యోతి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, బండిఆత్మకూరు, వెలుగోడు, శ్రీశైలం, కొత్తపల్లి, మిడ్తూరు, నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాలకు సంబంధించి నిత్యావసర సరుకుల వస్తువుల పంపిణీ చేసే దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకానికి ఈ నెల 16వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ నోటిఫికేషన్‌ను పెండింగ్‌లో ఉంచామని సవరించిన నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. అప్పటి వరకు ఎవరూ దరఖాస్తులు పంపరాదని సూచించారు. అదేక్రమంలో ఇంతకుముందు దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని వెల్లడించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వ్యవసాయ శాఖ అధికారికి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పాములపాడు డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో రబీలో మినుము పంట సాగుచేసి నష్టపోయిన రైతులను పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం మండల కమిటీ నాయకులు సామన్న, కార్యదర్శి రాజు కోరారు. సోమవారం మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది రబీలో మినుము పంటను మండలంలో వేల ఎకరాలలో సాదు చేశారు. అయితే పంటకు పచ్చతెగుళ్ల, బూడిద తెగుళ్ల సోకుతండడంతో పూర్తిగా నాశనమవుతుందని అన్నారు. ఎన్ని రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం లేక పంటను దున్నేస్తున్నారన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ప్రాచీన సంస్కృతులను పరిరక్షించాలి



బహుమతులను ప్రదానం చేస్తున్న కరస్పాండెంట్ తాజుద్దీన్

ఆత్మకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ తాజుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పాఠశాల నందు మాతృభాషా పరిరక్షణ, పండుగలు, సంప్రదాయాలు అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే సంస్కృతులు, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో 8వ తరగతి విద్యార్థిని కుబ్రా మహేక్, ద్వితీయ స్థానంలో 9వ తరగతి విద్యార్థిని రజియా, తృతీయ స్థానంలో 8వ తరగతి విద్యార్థిని ఫసిహా నిలిచినట్లు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ



రుద్రవరంలో క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పాములపాడు డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలో కబడ్డీ క్రీడాకారులకు టీడీపీ నాయకులు హుస్సేన్‌బాషా పంపిణీ చేశారు. సోమవారం స్థానిక నాయకులతో కలసి 15 మంది క్రీడాకారులకు దాదాపు రూ.15వేలు విలువ చేసే టీషర్ట్స్‌ను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు నైపుణ్యం పెంచుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. టీడీపీ తరపున తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తానని అన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మిడుతూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ ఆధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ నిర్లక్ష్యం వల్ల పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యమైందని, సర్పంచులకు నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సర్పంచులకు 15 ఫైనాన్స్ నిధులు మంజూరు చేశామన్నారు. కొందరు సర్పంచులు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రశ్నించగా అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ గత 5 ఏళ్ల కాలంలో సమస్యలు పరిష్కరించేందుకు గళం విప్పి గత ప్రభుత్వాన్ని ప్రశ్నించే దమ్ము ధైర్యంలేదా అని ఎమ్మెల్యే వారిపై ఫైర్ అయ్యారు. గతంలో జరిగిన తప్పులు జరగ కుండా గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వం చేస్తుందని అన్నారు. గ్రామాల్లో వచ్చే వేసవి నాటికి తాగు నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో దశరథరామయ్య, తహసిల్దార్ శ్రీనివాసులు, సీడీపీవో కోటేశ్వరమ్మ, హౌసింగ్ డీఈ నాగరాజు, ఈవోఆర్‌డీ సంజన్న, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపమండల అధ్యక్షులు నబిరసూల్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు అమానుషం



ఆత్మకూరులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కించపరిచేలా కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం అమానుషమని ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ నాగన్న, మల్లె ఎలీషా, సాంబశివుడు, శీలం శేష, మల్లయ్య, వామపక్ష పార్టీల నాయకులు రణధీర్, ప్రతాప్ పేర్కొన్నారు. సోమవారం కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆత్మకూరులోని పాతబస్టాండ్‌లో గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. అతర్వాత తహసీల్దార్ కార్యాలయం, కేజీరోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా గౌడ్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. తక్షణమే ఆయనను పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బేషరతుగా పదవికి రాజీనామా చేయాలని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బండిఆత్మకూరు బస్టాండ్‌లో సీపీఎం, దళిత మహిళా సేన, మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అమిత్‌షా చిత్రపటాలను నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రత్నమయ్య, రాజు, రామచంద్రుడు, రోజక్క, వెంకటరమణరాజు, మహేశ్, ఆనంద్, శ్యామ్, పుల్లయ్య, ఆనంద్, సర్దార్‌ఆలీ, చాంద్‌బాషా, శివరాముడు, రఫీ పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించండి: కలెక్టర్



నందివర్గం గ్రామ చేనేత వస్త్రాల స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చేనేత ఉత్పత్తులను పోత్సహించి చేనేత కార్మికులకు చేయూతను అందించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా బనగానపల్లె మండలం నందివర్గం గ్రామ చేనేత స్టాల్‌ను ప్రారంభించి అధికారులందరిచే చేనేత వస్త్రాలను కొనుగోలు చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేతన వస్త్రాలను ప్రతివారం ప్రభుత్వ ఉద్యోగులందరూ చేనేత వస్త్రాలను ధరించి చేనే త ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. ఇటీవల తాను నందివర్గం చేతన సొసైటీని సందర్శించానని, 100కుటుంబాలు 13 మగ్గాలు మాత్రమే ఉన్నాయన్నారు. రెండు మగ్గాల్లో చీరలు, మిగిలిన మగ్గాల్లో లుంగీలు, టవల్స్ మాత్రమే నేస్తున్నారని, రోజు ఒక్కొక్కరికీ రూ. 180 నుంచి రూ. 190లు మాత్రమే కూలి గిట్టుబాటు అవుతోందన్నారు. పేదస్థితిలో ఉన్న చేనేత సొసైటీలను ఆదరించి చేనేత ఉత్పత్తిదారులకు చేయూతను అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఘనంగా హైటీ

క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు నంద్యాల మున్సిపల్ టౌన్ హాలులో నంద్యాల కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన సోమవారం సాయంత్రం హైటీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మైనారిటీల సంక్షేమశాఖాధికారి సయ్యద సబిహా పర్వీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, తెలుగుయువత నాయకులు ఎన్ఎండి ఫిరోజ్, రామచంద్రారావు, క్రిష్టియన్ జేఏసీ నాయకులు, క్రైస్తవులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తాం

కొత్తపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీలు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులతో పరిష్కారమయ్యే విధంగా చూస్తామన్నారు. ఈ పరిష్కార వేదికలో భూమి కొలతలకు ఒక దరఖాస్తు, మ్యుటేషన్‌కు ఒకటి, ఆర్వోఆర్‌కు ఒకటి అర్జీలు వచ్చాయన్నారు. అదే విధంగా గువ్వలకుంట్ల గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణం మూడు మీటర్లు కాకుండా నాలుగు మీటర్ల వెడల్పు చేయాలని గ్రామస్థుడు సోల్మాన్ దరఖాస్తు చేసుకున్నాడని ఎంపీడీవో మేరీ తెలిపారు. వెంటనే ఈ సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా రైతు దినోత్సవం

నంద్యాల రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయల్ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాల కరస్పాడెంట్ ఇసాక్‌వలి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ యాకూబ్ మాట్లాడుతూ దేశానికి రైతులు వెన్నుముఖ లాంటి వారని, రైతులను గౌరవించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఈసందర్భంగా రైతులను సన్మానించారు. కార్యక్రమంలో రైతులు బీమవరం రామచంద్రారెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సీనియర్ ఫెన్సింగ్ క్రీడలకు నంద్యాల క్రీడాకారులు



జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో కోచ్

నంద్యాల రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన నలుగురు ఫెన్సింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయి సీనియర్ ఫెన్సింగ్ క్రీడలకు ఎంపికయ్యారు. ఈనెల 21 నుంచి 23 వరకు విజయవాడలోని ఐజియం స్టేడియంలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. పోటీలలో సీనియర్ పురుషుల శాబర్ వ్యక్తిగత విభాగంలో పోలా దత్తమునిస్వామి గోల్డ్‌మెడల్, సీనియర్ పురుషుల ఫాయిల్ విభాగంలో ఎర్రగుంట్ల మహిజిత్ సిల్వర్ మెడల్, యిడగొట్టు కాశీశ్వర వరప్రసాద్ బ్రాంజ్ మెడల్, సీనియర్ మహిళల యిపి వ్యక్తిగత విభాగంలో పబ్బతి చిన్మయశ్రేయ సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీలు ఈనెల 31 నుంచి జనవరి 3(2025) వరకు కేరళరాష్ట్రం కన్నూర్ జరగనున్న పోటీలలో పాల్గొననున్నారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో పాటు వారికి శిక్షణను ఇచ్చిన కోచ్ లక్ష్మీనారాయణను సోమవారం నంద్యాలలోని డిఎస్ఏ స్టేడియంలో సన్మానించారు.

హామీలను నెరవేర్చాలి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలో రైతులు చేసిన పోరాటం ఫలితంగా వెనక్కి తగ్గి మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తామని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు అందిస్తామని, విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణను ఆపేందుకు సిద్ధమని రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నేటి వరకు నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం .జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌కుమార్, రాజశేఖర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సిఐటియూ జిల్లా పాధ్యక్షులు తోట మద్దులు, లక్ష్మణ్, బాలవెంకట్, రైతుసంఘం కూలీ నాయకులురంగనాయకులు, రాంబాబు, రాంబాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్‌ను బాధితునికి అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును పట్టణానికి చెందిన చిన్నపోగు తేజేశ్వర్‌రెడ్డికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అందజేశారు. సోమవారం పట్టణంలోని సాయిబాబా పేటకు చెందిన తేజేశ్వర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. ఆసుపత్రిలో చికిత్సపొందిన ఆయన సీఎం సహాయ నిధికి ధరఖాస్తు చేసుకోగా రూ.76,164 ఆర్థిక సహాయాన్ని సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైంది. ఈ చెక్కును ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్వయంగా బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు జాకీర్ హుస్సేన్, ముర్తుజావలి, కౌన్సిలర్లు జాకీర్, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌గౌడ్, రావూఫ్, మల్లికార్జునరెడ్డి, ఉపేంద్ర, సురేంద్ర, భరత్, రవీంద్రారెడ్డి, రజినికుమార్‌రెడ్డి, మహిళా నాయకులు మీనాక్షిదేవి పాల్గొన్నారు.

● కేసీకి ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలి

రైతు దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని రైతులకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జూలై నెలలోనే కేసీ కాలువకు సాగునీరు, పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేశామన్నారు. ఖరీఫ్‌లో వర్షాలు సంవృద్ధిగా కురిశాయన్నారు. రబీలో కూడా కేసీ కాలువకు మార్చి వరకు అధికారులు సాగునీరు ఇస్తామని చెబుతున్నారని, అయితే రైతులకు పూర్తి పంటలు రావాలంటే ఏప్రిల్ వరకు సాగునీరు అందించాలని అధికారులను కోరుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడిని కలిసి నాయకులు



రామలింగారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మహానంది, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ ప్రాజెక్ట్ నూతన అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డిని సోమవారం మహానంది మండలం బుక్కాపురంకు చెందిన టీడీపీ నాయకులు కలిశారు. నంద్యాల పట్టణంలోని ఆయన నివాసంలో టీడీపీ నాయకులు కంచర్ల శివశంకర్, నాగపుల్లయ్య, వేమూరి కేశవరావుతో పాటుమారెడ్డి జయరాం, గుద్దేటి నాగరాజు,మాజీ వీఆర్వో పాములేటిలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేసీ కెనాల్ అభివృద్ధికి కృషి చేస్తానని రామలింగారెడ్డి హామీ ఇచ్చారు.

ఘనంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు

వెలుగోడు డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు కెనరా బ్యాంక్ ఆవరణలో బ్యాంక్ ఏర్పాటు చేసి 50 సంలు పూర్తి చేసుకొన్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఫౌండర్ సుబ్బారావుపై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ సురేశ్‌కుమార్, బ్యాంక్ మేనేజర్ సూర్యదేవనాయక్, ఏపీఎం సుగుణపాల్, రామలింగేశ్వరరెడ్డి, ఇమ్మానియేలు, హిదాయత్ అలీఖాన్, శివశంకరరావు, ఆది నారాయణరెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు

'ఏ వస్తువు కొన్నా బిల్లు తప్పనిసరి'



శివపురం హైస్కూల్‌లో ప్రసంగిస్తున్న బొల్లు ప్రసాద్

కొత్తపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుడు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని శివపురం హై స్కూల్ హెచ్ఎం పుల్లారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని శివపురం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులు బొల్లు ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ అవసరాల కోసం ఎవరైతే వారికి సంబంధించిన వస్తువులు కొనుగోలు చేస్తారో అలాంటి వాటికి వినియోగదారుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. అనంతరం బొల్లు ప్రసాద్ మాట్లాలుతూ విద్యార్థిని విద్యార్థులకు వివరణాత్మకంగా వినియోగదారులు ఏ విధంగా మోసాలకు గురవుతున్నారన్న వాటిపై వివరించారు. అలాగే రక్షణ చట్టాలను వివరించే కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శారదమ్మ, ఇందిరా కుమారి, వసంత లక్ష్మి, ఖాజా మొహిద్దీన్, పాములేటి తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన



రోగులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీదేవి

పాణ్యం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఆయుష్ శాఖ నిర్వహిస్తున్న ప్రకృతి పరీక్ష అభియాన్ కార్యక్రమం ద్వారా ఆరోగ్య సమస్యలు తెలుసుకోవచ్చని పాణ్యం ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రకృతి పరీక్ష అభియాన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వాతము, పిత్తము, కఫము అనే మూడు గుణాలు వాటి లక్షణాల పరంగా మనిషికి ప్రకృతి అనేది ఉంటుందన్నారు. వాత ప్రకృతి, పిత్త ప్రకృతి, కఫ ప్రకృతి అనేది ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. మనిషిలో ఏడు రకాల ప్రకృతులు ఉంటాయన్నారు. ప్రకృతిని బట్టి వచ్చే సాధారణ వ్యాధుల గురించి వాటిచికిత్స గురించి రోగులకు అవగాహన కల్పించారు. నవంబరు 25 నుంచి ప్రకృతి పరీక్ష అభియాన్ అనే యాప్ ద్వారా ఆరోగ్యంపై ఆయుష్ శాక అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రహేలా, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

పాణ్యం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాంతిరాం పార్మసీ కళాశాల విద్యార్థి సి. పవన్‌కుమార్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌శెట్టి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 22 వతేదీన కర్నూలు ఔట్ డోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఎంపికైనట్లు తెలిపారు. జనవరి 3వ తేదీ నుంచి 5 వరకు కర్నూలులో జరిగే 50వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో విద్యార్థి పాల్గొంటారన్నారు. ఆర్‌జీఎం విద్యాసంస్థల ఎండీ శివరాం, పిడి మునిశంకర్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఘటిద్దాం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు

ఆత్మకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదని అన్నారు. రాయలసీమకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు నాగేశ్వరరావు, వీరన్న, సుబ్బయ్య, బాషా, రమణ తదితరులు ఉన్నారు.

మహానందిలో ఇమ్యూనైజేషన్ అధికారి పూజలు



మహానందిలో వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న సుదర్శన్‌బాబు

మహానంది, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల ఇమ్యూనైజేషన్ అధికారి సుదర్శన్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖమండపం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చన పూజలను భక్తి శ్రద్ధలతో చేశారు. కల్యాణ మంటపంలో వేదపండితులు వీరిని శాల్వాతో సన్మానించారు. ప్రసాదాలు అందచేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు ఉసేన్‌రెడ్డి, జగదీష్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా పట్టణ సమీపంలోని వైఎస్సార్ నగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలును ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ నగర్ టీడీపీ ఇన్‌చార్జి బుగ్గ రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ప్రజలు, పాస్టర్లు పాల్గొన్నారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్లు మాట్లాడుతూ జీసస్ ప్రబోధించిన క్షమ, ప్రేమ తత్వాలను అలవర్చుకోవాలని సూచించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రేమమూర్తి అయిన క్రీస్తు మార్గంలో పయనిద్దామని పిలుపునిచ్చారు. బుగ్గరాముడు ఆధ్వర్యంలో 300 మంది ప్రజలకు, వంద మంది పాస్టర్ల కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు.

రాయల్టీ సమస్య పరిష్కరించాలి


బనగానపల్లె రోడ్డులో నిరసన తెలుపుతున్న ట్రాక్టర్ల యజమానులు

బేతంచెర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నాపరాళ్ల సరఫరాకు సంబంధించిన రాయల్టీల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ట్రాక్టర్ల యజమానులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బనగానపల్లె రహదారిలో ట్రాక్టర్ల యజమానులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రాక్టర్ల, లారీల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల విరాళం


దాత నాగిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ప్రముఖ పారిశ్రామికవేత్త చెన్నారెడ్డి గారి నాగిరెడ్డి కంప్యూటర్లను పాఠశాల హెచ్ఎం గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యాయులకు విరాళంగా అందించారు. పాఠశాలకు కంప్యూటర్లు లేవని చెన్నారెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వెంటనే స్పందించి కంప్యూటర్లు అందజేశారు. దాత నాగిరెడ్డికి హెచ్ఎం, ఉపాధ్యాయులు సత్కరించారు. హెచ్ఎం గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ అడిగిన వెంటనే విద్యార్థులకు కంప్యూటర్లు అందించిన దాత నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పల్లకీ సేవ

బనగానపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

చాగలమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని వైసీపీ కార్యాలయంలో సోమవారం రాష్ట్రమైనార్టీసెల్ కార్యదర్శి షేక్ బాబులాల్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఆదర్శ రైతులను సన్మానించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, నష్టపోయిన పంటలకు పరిహారం అందించి, ఎరువులు, పురుగు మందుల ధరలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోహెల్, వైసీపీ నాయకులు ముల్లారఫి, అబ్దుల్లా, ఖాదర్‌బాష, రఫి, షరీఫ్, గేట్లమాబు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్

చాగలమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థుల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఆడిట్ సభ్యుడు డెన్ని జాన్సన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నామని అన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కాంత్యాయని, పీడీ ఆశాజ్యోతి, సీనియర్ ఉపాధ్యాయులు రవిప్రకాష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి పల్లెం విరాళం


చౌడేశ్వరీమాతకు వెండిపల్లెంను విరాళంగా అందిస్తున్న దాతలు

బనగానపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాతకు అనంతపురానికి చెందిన జ్యోతిర్మయి, కుటుంబ సభ్యులు రూ. 98,450లు విలువ గల 897 గ్రాముల వెండి పల్లెమును సోమవారం విరాళంగా అందించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు అందుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం తహసీల్దార్ నటరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో పూజలందుకున్న కాలభైరవ స్వామి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్న కందుకూరు గ్రామంలో కొలువైన కాలభైరవ స్వామి కి భక్తులు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. బహుళ అష్టమి, స్వామి వారి జయంతి సందర్భంగా కాలభైరవుడి మూల విరాట్‌ను పూలమాలతో అలంకరించి పూజలు చేశారు. కాలభైరవ స్వామి, కాళి కామాత అమ్మవారికి భక్తులు అభిషేకం, ఆకు పూజ, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. స్వామి వారి పల్లకిని మంగళవాయిద్యాలతో ఊరేగించారు. శ్రీరామదండు, మేడిదిన్నె, చింతకుంట భజన సంఘాల ఆధ్వర్యంలో భజనలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, భోజన వసతి కల్పించారు.

కొలిమిగుండ్ల: మండలకేంద్రం సమీపంలోని లక్ష్మీనృసింహ కొండపై వెలసిన కాళభైరవుడి ఆలయంలో స్వామి వారి ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పేరం బయ్యపురెడ్డి, పేరం నందకిశోర్‌రెడ్డిల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూలమాలలు, వడల మాలాధారణతో పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పేరం సూర్య నారాయణరెడ్డి, నాగేశ్వరరెడ్డి, వైఎస్ నారాయణరెడ్డి, రామశేషారెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక

బేతంచెర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక కార్యక్రమాన్ని ప్రతి సోమవారం ప్రభుత్వం నిర్వహిస్తుందని తహసీల్దార్ ప్రకాష్‌బాబు అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు, అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.


ముత్యాలపాడులో ఎస్పీజీ చర్చి


ప్యాపిలిలో చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించిన నిర్వాహకులు


వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న జానీ ప్రభాకర్

చర్చిల్లో క్రిస్మస్ శోభ

- ముస్తాబైన ప్రార్థన మందిరాలు

చాగలమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినం కోసం మండలంలోని ఆయా గ్రామాల్లో చర్చిలను విద్యుత్‌దీపాలు, స్టార్లతో ముస్తాబు చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు, క్రీస్తు సందేశం వినిపించేందుకు ఆయా చర్చిల ప్రాంగణాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముత్యాలపాడు గ్రామంలోని 133 ఏళ్ల చరిత్రగల ఎస్పీజీ చర్చిలో పశువుల కొట్టం, క్రీస్తు జననం సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. ఆర్సీఎం, సీఎస్ఐ, మార్తోమా పలు చర్చిలను విద్యుత్ దీపాలు, స్టార్లతో అలంకరించారు. క్రైస్తవుల ఇళ్ల వద్ద క్రిస్మస్ ట్రీ, స్టార్లను ఏర్పాటు చేసుకున్నారు.


చాగలమర్రిలో ఆర్సీఎం చర్చిలో యేసు చరిత్రను తెలిపే పశువుల కొట్టం

భక్తిశ్రద్ధలతో మినీ క్రిస్మస్

చాగలమర్రి గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో డీనరీ చైర్మన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మైదుకూరు డీఎస్సీ రాజేంద్రప్రసాద్, ఫాదర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవులు, మహిళలు కలిసి క్యాండిల్స్ చేతపట్టి కీర్తనలు ఆలపిస్తూ ఆరాధన చేశారు. అనంతరం చర్చిలో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. క్రీస్తు జననాన్ని వివరించారు.

ప్యాపిలి: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు అయ్యాయి. ప్యాపిలి, హుసేనాపురం, కలచట్ల, బూరుగుల, ఊటకొండ తదితర గ్రామాల్లో చర్చిలకు తుది మెరుగులు దిద్ది విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో గ్రామాల్లో క్రిస్మస్ సందడి కనిపిస్తుంది.


చాగలమర్రి సీఎస్ఐ చర్చిలో కొవ్వొత్తులతో ఆరాధనలో పాల్గొన్న ఫాదర్, డీఎస్పీ

వృద్ధులకు క్రిస్మస్ కానుకలు

డోన్ రూరల్: పట్టణంలోని కొండపేటలో ప్రార్థన సమయం నిర్వహకులు జానీ ప్రభాకర్ క్రిస్మస్ కానుకల పంపిణీలో భాగంగా సోమవారం పేదలకు, వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. కడప చెందిన దైవాదీనం దంపతుల ఆర్థిక సాయంతో ఈ చీరలు పంపిణీ చేపట్టినట్లు ఆయన తెలిపారు.


క్యాండిల్స్‌తో గుడి ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా ఉరుసు

- ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న మంత్రి బీసీ


ఫతేహాలు సమర్పిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని హజరత్ సయ్యద్ సిద్దికి జలాల్ రహమతుల్లా అలైహి హజరత్ సయ్యద్ బరియుద్దీన్‌షా ఖాద్రి, రహమతుల్లా అలైహి, హజరత్ సయ్యద్ మీర్ హసం అలా, దేహెలివాలే సాహెబ్ ఉర్సు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హజరత్ సయ్యద్ హుసేన్ బాష ఖాద్రితో కలిసి దర్గా వద్ద ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పాతబస్టాండ్‌లోని దర్గా వద్ద సొంత నిధులతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బురానుద్దీన్, అమార్ జాన్, అహమ్మద్ హుసేన్, పూలకలాం, వలిబాషా, రజాక్, రహిమాన్, హర్షద్, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖవ్వాలి ఉత్సవాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

శ్మశాన వాటిక సమస్య పరిష్కరించండి: మంత్రి బీసీ

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని హిందూ శ్మశాన వాటికకు సంబంధించిన సమస్య పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం టీడీపీ గ్రామ నాయకుల విజ్ఞప్తి మేరకు శ్మశాన వాటిక రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి, ఎంపీడీవో ప్రసాద రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిక్రిష్ణ, ఎంఈవో అబ్దుల్‌కలాం, టీడీపీ నాయకులు గూలి నాగేశ్వరరెడ్డి, ఉలువల నరసింహుడు, చంద్రమోహన్ యాదవ్, ఉలువల ప్రసాదు, రవి, చిట్టి, మహేశ్వరరెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈపంట నమోదు తప్పనిసరి

దొర్నిపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈపంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. సోమవారం దొర్నిపాడు గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 31 వరకు రైతులు పంటల బీమా చేయించుకోవాలని అన్నారు. ఏఈవో సురేంద్ర, వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

బాధితులకు న్యాయ సాయం అందించాలి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయ సహాయం అందించాలని నంద్యాల జిల్లా ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఓబులేసు, ఎమ్మార్పీఎస్ ఆళ్లగడ్డ మండల అధ్యక్షుడు బాల ఓబులేసు అన్నారు. ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన న్యాయవాది శివప్రసాద్‌రావును సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో పెద్దఓబులేసు, రాజన్న, మద్దిలేటి, నరసింహ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేత

ప్యాపిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగమర్రి గ్రామంలో ఆంజనేయస్వామి మాన్యంలో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణాన్ని సోమవారం రెవెన్యూ అధికారుల నిలిపివేశారు. గ్రామానికి చెందిన ఆది నారాయణ పంచర్ షాపు కోసం షెడ్డును నిర్మిస్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారి వంశీ నిర్మాణాన్ని నిలిపి వేశారు.

రేపు కొచ్చెర్వులో పెద్దమ్మతల్లి జాతర

డోన్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలంలోని కొచ్చెర్వులో బుధవారం పెద్దమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు. బుధవారం తెల్లవారుజాము నుంచి పెద్దమ్మ తల్లికి పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా రోగ్యమే ప్రభుత్వ లక్ష్యం


చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారులు

చాగలమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైద్యశాఖ ప్రాజెక్టు అధికారి అంకిరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా వైద్య బృందంతో కలిసి వైద్యశాలలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ హెల్త్‌మిషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య ఉపకేంద్రాల పనితీరును పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వైద్యశాఖ ఆదేశాల మేరకు నెలలో 10 గ్రామాలను సందర్శించనున్నట్లు తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని అన్నారు. చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఇద్దరు వైద్యులు సెలవులో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గణాంకశాఖ అధికారి సుజాత, ప్రోగ్రామ్ అధికారి నాజ్మీ, ఎంఐఎస్ శివ, సీహెచ్‌వో రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

- జగ్గయ్య, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్



చాగలమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి ఉంచినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య తెలిపారు. 19 గ్రామ పంచాయతీలు, మజరా గ్రామాల్లో నీటి సమస్యను గుర్తించి ముందస్తుగా చర్యలు చేపడతాం. చేతి బోర్ల మరమ్మతులకు క్రాస్‌ప్రోగ్రాం నిర్వహిస్తాం.

ప్రశ్న: గ్రామాల్లో అదనపు ట్యాంకుల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారా?

జవాబు: మండలంలో మల్లేవేముల, చిన్నబోదనం, ముత్యాలపాడు, మద్దూరు, పెద్దవంగలి, గొట్లూరు, కలు గొట్లపల్లె, చింతలచెరువు, చాగలమర్రి గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంది. సమస్య పరిష్కారం కోసం అదనపు ట్యాంకుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం.

ప్రశ్న: జగనన్న కాలనీలో కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారా?

జవాబు: జగనన్న కాలనీలో మంచి నీటి కొళాయిల కనెక్షన్‌లు ఇవ్వకుండా నిలిపివేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే కొళాయిలు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: మండలంలో ఎన్ని చేతిబోర్లు ఉన్నాయి?

జవాబు: 162 చేతిబోర్లు పని చేస్తున్నాయి. 12 బోర్లు పని చేయడం లేదు. 44 పీడబ్ల్యూ స్కీమ్‌లు, 18 మినీ ట్యాంకులు, 33 ఓహెచ్‌ఆర్ ట్యాంకులు ఉన్నాయి.

ప్రశ్న: వేసవిలో స్పెషల్‌క్యాంపులు నిర్వహిస్తున్నారా?

జవాబు: మండలంలో ముందస్తుగా రైతులతో చేతిబోర్ల సామగ్రి కొనుగోలు చేస్తాం. 15రోజుల పాటు గ్రామాల్లో క్రాస్ ప్రోగ్రామ్ నిర్వహించి నీటి సమస్య పరిష్కరిస్తాం.

సీసీ రోడ్ల నిర్మాణానికి సహకరించాలి

అవుకు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెట్టుపల్లె గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రజలు సహకరించాలని టీడీపీ నాయకుడు గొంగటి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులను అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ దినేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దుర్గ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన ఉండాలి

అవుకు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య అన్నారు. సోమవారం అవుకు పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనపరచిన తొమ్మిది మంది విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని చెన్న కేశ్వరి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సుమలత, రాధిక, సబ్బ లక్ష్మి, సంగయ్య, విద్యుత్ లైన్‌మెన్‌లు భాస్కర్, వెంకటరాముడు, రామచంద్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న లాయర్ అల్లీహుసేన్

కోవెలకుంట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని హైకోర్టు లాయరు గాలేసాహెబ్ గారి అల్లీహుసేన్ అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ఎఎంకే విద్యాసంస్థలో ఇంటర్ జోన్‌బాక్సింగ్ అండ్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 150 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా లాయర్, నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ లీగల్ అడ్వయిజర్ జాతీయ స్థాయి స్కూలు గేమ్స్‌లో సిల్వర్ పతకాలు సాధించిన యస్విత, గోపజ్ఞను, జాతీయ స్థాయి కరాటే స్కూలు గేమ్స్‌లో పాల్గొన్న మహ్మద్‌గౌస్, కావ్య, చైతన్య లక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సర్దార్, చంద్ర, హుసేనయ్య, పాస్టర్ శైలస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

అవుకు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన కోనేటి విజయ్, మేడసారి గణేష్ అనే నాటుసారా విక్రయదారుల నుంచి వంద లీటర్ల నాటుసారా, మోటరు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండమనాయునిపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లోని సారా స్థావరాలపై దాడులు జరిపి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోతకు గురైన గంగ బ్లాక్‌చానెళ్ల గట్టు

- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేయించాలని రైతుల వేడుకోలు


కోతకు గురైన తెలుగుగంగ 20వ బ్లాక్‌చానెల్ గట్టు

రుద్రవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ బ్లాక్‌చానెళ్ల గట్టు కోతకు గురయ్యాయి. రుద్రవరం మండలంలో 16వ బ్లాక్‌చానెల్ గట్టు నుంచి 25 బ్లాక్ చానెల్ గట్టు వరకు గంగ బ్లాక్‌చానెళ్లు ఉన్నాయి. గట్టు ఎక్కడి పడితే అక్కడ కోతకు గురై బలహీనంగా మారింది. కాల్వల్లో నీరు పారే సమయంలో గట్టెక్కి ప్రవహిస్తున్నా యి. అధికారులకు మొరపెట్టుకున్నా పెడచెవినపెడుతన్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గంగ బ్లాక్‌చానెళ్ల గట్లకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరారు. అలాగే బ్లాక్‌ఛానెళ్ల వెంట కంపచెట్లు పెరిగి పంట పొలాలకు ఛానెళ్ల గట్ల వెంట వెళ్లడానికి కూడా వీలు కాకుండా పోయిందని రైతులు వాపోయారు. అటు కంప చెట్లు తొలగించి ఇటు కోతకు గురైన బ్లాక్‌ఛానెళ్ల గట్లు మరమ్మతులు చేయించాలని రైతులు కోరారు.


కోతకు గురైన గంగ బ్లాక్‌చానెల్ గట్టు

మరమ్మతులు చేయించండి



గంగ బ్లాక్‌చానెళ్ల గట్టు కోతకు గురయ్యాయి. మరమ్మతులు చేయించాలి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. గట్టు కోతకు గురి కావడంతో నీటి సరఫరా ఉన్నప్పుడు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

- శ్రీనివాసులు, రైతు, రుద్రవరం

బ్లాక్‌చానెళ్ల పరిస్థితి ఇంతేనా



గంగ బ్లాక్‌చానెళ్ల పరిస్థితి ఇంతేనా. రుద్రవరం మండలంలో 16 నుంచి 25 వరకు బ్లాక్‌చానెళ్లు ఉన్నాయి. బ్లాక్‌ఛానెళ్ల వెంట గట్టు కోతకు గురయ్యాయి. కంపచెట్లు పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వాటికి మరమ్మతులు చేయించి రైతులకు సౌకర్యం చేకూరేలా చర్యలు తీసుకోవాలి.

- నరసింహులు, రైతు, రుద్రవరం

సచివాలయాల్లో సమయ పాలన ఏదీ?

- విధుల్లో ముగ్గురు లేక నలుగురు మాత్రమే - అందుబాటులో లేక ఇబ్బందులు
- సేవలందక కార్యాలయాల వద్ద ప్రజల ప్రదక్షిణలు


మద్దూరు సచివాలయంలో విధుల్లో ఉన్న ఉద్యోగులు

చాగలమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ప్రస్తుతం 17 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు గాను గత ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి 10 రకాల వివిధ శాఖలకు సంబంధించి కార్యదర్శులను నియమించింది. ఇలా చూసుకుంటే అన్ని సచివాలయాలు కలుపుకొని 148 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 139 మంది మాత్రమే ఉన్నారు. 10 మంది వివిధ సెలవుల్లో వెళ్లారు. మరో 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ స్థానాల్లో వేరు వేరు ప్రాంతాలకు చెందిన వారు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. వీరు ప్రజలకు దాదాపుగా 210 సేవలు అందించాల్సి ఉంది. వీరు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండాలి. ఏదైన ప్రభుత్వ, ఇతర అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి ఉంటే ఖచ్చితంగా మూమెంట్ బుక్కులో రాసి వెళ్లాలి. అయితే కొందరు సచివాలయ ఉద్యోగులు దీనిని ఆసరాగా చేసుకొని ప్రభుత్వాన్ని, ప్రజలను మోసగిస్తున్నారన్న విమర్శలున్నాయి. కార్యాలయానికి రావడంతోనే ఏదో ప్రభుత్వ కార్యక్రమంటూ సాకు చెప్పి బయటకు వెళ్లి సొంత పనుల్లో నిమగ్నమవుతున్నారు. మూమెంట్ బుక్కులో రాసిన చోటుకు వారు వెళ్లిన దాఖలాలు లేవు. ఈ క్రమంలో అర్జిదారులు, పలు సేవలకు వచ్చిన వారికి చుక్కలు కనపడుతున్నాయి. గట్టిగా అడిగితే పని చేయరేమోనని మౌనంగా వెనక్కు వస్తూ మరో రోజు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం ఆంధ్రజ్యోతి మద్దూరు, పెద్దబోదనం సచివాలయాలను పరిశీలించగా ముగ్గురు లేదా నలుగురు మాత్రమే ఉండటం కనిపించింది. ఆయా సచివాలయాల్లో 8మంది ఉండాల్సి ఉండగా తక్కువమంది కనిపించారు. ఈ నేపథ్యంలో అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. ప్రజలకు నిరంతరంగా సేవలు అందించేలా దృష్టి సారించాలని ఆశిద్దాం.


పెద్దబోదనం సచివాలయంలో విధుల్లో ఉన్న ఉద్యోగులు